క్లుప్తంగా

ఆలయ భూములకు హద్దులు చూపాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

గంభీరావుపేట: గంభీరావుపేటలోని 700 ఏళ్ల నాటి శ్రీ సీతారామస్వామి దేవస్థానానికి సంబంధించి గ్రామంలో కొన్ని వ్యవసాయ సాగు భూములు ఉన్నాయి. ఈ భూములు ఆక్రమణకు గురికాకుండా సరిహద్దులు చూపి హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు, భక్తులు, గ్రామ పురోహితులు రాచర్ల పార్థసారథిశర్మ, విజేందర్‌రెడ్డి, చేపూరి కిషన్, రాజేష్ గాంధీలు మంగళవారం తహసీల్దార్ మారుతిరెడ్డికి వినతి పత్రం అందించారు.

దుమాలకు ఆర్టీసీ బస్సు ప్రారంభం



ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రం సమీపంలోని దుమాల గ్రామానికి ఆర్టీసీ బస్సును మంగళవారం అధికారులు ప్రారంభించారు. మండల కేంద్రానికి అతి సమీపంలో ఉండడంతో ఇన్నాళ్లు ఆర్టీసీ సేవలు ఆ గ్రామస్తులకు అందలేదు. ఇటీవల దుమాల గ్రామస్తులు సిరిసిల్ల ఆర్టీసీ డీపో మేనేజర్‌కు విన్నవించారు. గ్రామస్తుల విన్నపంతో మంగళవారం ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం ప్రకాశ్‌రావు మాట్లాడుతూ బస్సు సేవలను ప్రారంభించడంలో కాస్త ఆలస్యమైందని, సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అధికారుల సమన్వయ లోపం



వంతెనపై మట్టి పోసి మూసివేసిన దృశ్యం

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్, గన్నెవారిపల్లె గ్రామాల మధ్య నక్కవాగుపై నిర్మించిన వంతెనను కాంట్రాక్టర్ మంగళవారం మూసివేశారు. రెండేళ్లుగా సాగుతున్న వంతెన పనులు చివరి దశకు వచ్చాయి. బ్రిడ్జి పనులు పూర్తి కాగా, రాకపోకలను రెండు నెలలుగా సాగిస్తున్నారు. అయితే వంతెన తర్వాత ఉన్న రహదారి నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉండడంతో పనులు చేయలేదు. దీంతో పూర్తయిన పనులకు బిల్లులు రావడం లేదని కాంట్రాక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. వంతెనకు ఇరువైపులా ఉన్న రహదారి నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు ఆటంకం కలిగిస్తున్నాయని, వాటిని తొలగించాలని అధికారులకు విజ్ఞప్తి చేశామన్నారు. వారు స్పందించకపోవడంతో వంతెనపై రాకపోకలు సాగకుండా మట్టిని పోశారు. దీంతో గన్నెవారిపల్లె, సేవాలాల్‌తండా ప్రజలు ముస్తాబాద్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. అయితే దీనిపై సెస్ అధికారులు స్పందిస్తూ పనులకు ఆటంకంగా ఉన్న స్తంభాలను తొలగిస్తామని సదరు కాంట్రాక్టర్‌కు చెప్పామని పేర్కొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయండి

ఇల్లంతకుంట: ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం వేగవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు మేకల మల్లేశం అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలకేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి 15 రోజులైనా కొనుగోళ్లలో జాప్యం నెలకొందన్నారు. వరి ధాన్యంతో పాటు పొద్దుతిరుగుడు ధాన్యాన్ని కొనుగోలు చేపట్టాలని ఆయన పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు నాగ సముద్రాల సంతోష్, పిన కాసి అనిల్, కమలాకర్ రావు, బీరయ్య, రేగుల అజయ్, గొర్రె అఖిల్, పందుగ ప్రశాంత్, తదితరులున్నారు.

కేన్సర్‌పై అవగాహన



సిరిసిల్లటౌన్: కేన్సర్ మహమ్మారిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ నిపుణులు పేర్కొన్నారు. మంగళవారం సెస్ ప్రధాన కార్యాలయం యశోద హాస్పిటల్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో క్యాన్సర్ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేన్సర్‌పై సలహాలు సూచనలు, కేన్సర్ చికిత్సను వివరించారు. కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కొట్టెపల్లి సుధాకర్, సెస్ డీఈఈ సుబ్బారెడ్డి, ఏఏఈలు రాజేందర్, సతీశ్, శ్రీదేవి, ఉమ, ఉమేర, నీరజ, జ్యోతి ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల సంత!



గొడుగు నీడలో కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారులు

- ఎండ, వానకు గొడుగు నీడలోనే సంత
- మండలకేంద్రంలో రోడ్డుపైనే క్రయ విక్రయాలు
- ఆదాయం ఉన్నా.. సౌకర్యాలు సున్నా
- పట్టించుకోని అధికారులు

గంభీరావుపేట: గంభీరావుపేట మండలకేంద్రంలోని రోజువారీ సంతలో సమస్యలు నెలకొన్నాయి. సదుపాయాల లేమితో క్రయ విక్రయదారులు తిప్పలు పడుతున్నారు. ఎండైనా.. వానకైనా గొడుగు నీడలో కూర్చొని వ్యాపారం చేసుకోవాల్సిన దుస్థితి. తైబజార్ నిర్వహణతో గ్రామపంచాయతీకి ఏటా రూ.లక్షల ఆదాయం వస్తున్నా.. అధికారులు సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం వహిసస్తున్నారు. ప్రధాన రోడ్డుపైనే కూరగాయలు, వస్తువులు పెట్టుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

షెడ్లు కూల్చేసి..

గతంలో కాస్త ఉపశమనంగా క్రయ విక్రయాల కోసం షెడ్లు ఉండేవి. సమీకృత మార్కెట్ నిర్మిస్తామని గత గ్రామపంచాయతీ పాలకవర్గం పాత షెడ్లను కూల్చేసింది. దీంతో ఉన్న నీడ కూడా లేదు. ఆధునిక హంగులతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు కూరగాయల షెడ్లు, పాత గ్రామపంచాయతీ కార్యాలయాన్ని కూల్చేసి నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. ఇంతలో పాలకవర్గం పదవికాలం ముగిసింది. ప్రభుత్వం మారింది. దీని కోసం వెచ్చిస్తామనుకున్న నిధులు సైతం ఇతర పనులకు ఖర్చు చేశారు. దీంతో ఉన్న నీడపోయి క్రయ విక్రయదారులు రోడ్డుపైనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ రోజువారీ సంతలో ఇబ్బంది పడుతున్నారు.

ఆదాయం పెరిగినా..

గంభీరావుపేట గ్రామపంచాయతీ తైబజార్ గతేడాది రూ.లక్షా 50వేలు ఉండేది. ఈసారి రెండింతలై తైబజార్ రూ.3లక్షల పై చిలుకు వేలం పాట పాడింది. ఆదాయం పెరుగుతున్నా.. సంతలో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వాహనాల పార్కింగ్, క్రయ విక్రయదారులకు షెడ్లు, తాగునీటి సదుపాయం, మూత్రశాలలు లేక క్రయ విక్రయదారులు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం జరిగే సంతకు చుట్టు పక్కగ్రామాల నుంచి రైతులు, వ్యాపారులు కూరగాయలు, నిత్యావసర వస్తువులు తీసుకొస్తుంటారు.

వేలంపాటకు దూరం

గంభీరావుపేట గ్రామపంచాయతీ పరిధిలోని వ్యాపార దుకాణాల సముదాయ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఏటా సంతతో పాటు కాంప్లెక్స్‌లోని దుకాణాలకు వేలం పాట నిర్వహిస్తారు. ఇటీవల నిర్వహించిన వేలం పాటలో దుకాణ సముదాయంలోని గదులకు వేలం పాడడానికి ఒక్కరూ కూడా ముందుకురాలేదు. డిపాజిట్లు చెల్లించలేదు. దీనికి గదుల అద్దె ఎక్కువగా ఉందనేది ఓ కారణంగా చెప్పుకోవచ్చు. ఇదిలా ఉంటే.. ప్రస్తుతం గదుల్లో కొనసాగుతున్న వారు సైతం రూ.లక్షల్లో అద్దెలు చెల్లించాల్సి ఉంది. ఇటు వారి నుంచి అద్దెలు వసూలు చేయక పంచాయతీ అధికారులు మెతక వైఖరి వహిస్తున్నారు.గ్రామప్రధాన కూడలిలో ఉన్న వ్యాపార దుకాణాలను దక్కించుకునేందుకు ఒక్కరు కూడా డిపాజిట్ చెల్లించి వేలం పాటలో పాల్గొనకపోవడం విడ్డూరంగాఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

సౌకర్యాలు కల్పించాలి



రోజు ఉదయం నుంచి రాత్రి వరకు గంభీరావుపేటలో సంత నిర్వహణ కొనసాగుతోంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి తాగేందుకు నీరు లేదు. మరుగుదొడ్లు లేవు. రోడ్లపైనే కూరగాయల క్రయ విక్రయాలు కొనసాగడంతో వచ్చిపోయే వారు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి సంతలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– రాగిశెట్టి నారాయణ, గంభీరావుపేట

నోటీసులిచ్చాం



పంచాయతీ వ్యాపార దుకాణాల సముదాయంలో ప్రస్తుతం కొనసాగుతున్న వారి పెండింగ్ కిరాయిలు చెల్లించాలని నోటీసులిచ్చాం. వారం పది రోజుల్లో తదుపరి చర్యలు తీసుకుంటాం. అద్దెలు ఎక్కువగా ఉన్నాయన్న కారణంగానే వేలం పాటలకు వ్యాపారులు ముందుకు రాలేదని తెలుస్తోంది. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. రోజువారీ సంతలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటాం.

–లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట



ఎల్లారెడ్డిపేట: మండలంలోని నారాయణపూర్‌లో కోతుల బెడదతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతుల దాడితో ఇప్పటికే ఎంతోమంది గాయపడ్డారని, విలువైన వస్తువులు, ఇతర సామగ్రిని ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి కోతులను బంధించి ఊరు దాటించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
జాఫర్, పంచాయతీ కార్యదర్శి: సెల్ నంబర్: 9640832448

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

మేడేకు పెద్ద ఎత్తున తరలిరావాలి

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్లలో హమాలీ కార్మికులతో కలిసి మే డే కరపత్రాలను ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీలకు కూలి నిర్ణయించాలని కోరారు. హెల్త్ కార్డులు, ఈఎస్ఐ సౌకర్యం, ప్రమాద బీమా రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. మే డే సందర్భంగా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, నేరెళ్ల హమాలీ సంఘం అధ్యక్షుడు చిన్న కుంటయ్య, పాండు, మారవేని శ్రీను, గంధం నారాయణ, పల్లె పండారి, బొల్లవేని శ్రీను, కన్నవేని విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: హమాలీ కార్మికులకు బీమా సౌకర్యం కల్పించి, రూ.10లక్షల పరిహారం ఇచ్చి, వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు కోరారు. మండలంలోని పోతుగల్‌లో మేడే కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. మేడే ఉత్సవాలను కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిద్దె నర్సయ్య, భూదయ్య, బాబు, చంద్రం, బాలయ్య, బాస్కర్, శ్రీనివాస్, అంజయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్ : కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

రుద్రంగి: మేడే దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండల సీఐటీయూ అధ్యక్షురాలు విమలక్క కోరారు. మంగళవారం మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కార్మికులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కార్మికులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మే 1న నిర్వహించే అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి కోరారు. మండలంలోని కనగర్తిలో హమాలీ కార్మికులతో కలిసి మేడే కరపత్రాన్ని ఆవిష్కరించారు. హమాలీ కార్మికులు పాల్గొన్నారు

లక్ష్యం మేరకు ఉపాధి పనులు చేపట్టాలి

కోనరావుపేట: ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులను నిర్దేశించిన లక్ష్యాల మేరకు పారదర్శకంగా చేపట్టి పూర్తిచేయాలని ఎంపీడీవో శంకర్‌రెడ్డి అన్నారు. నాగారంలో మంగళవారం ఉపాధి హామీ పనులను పరిశీలించారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల వివరాలను పరిశీలించారు. ఉపాధి హామీ నిధుల్లో 60 శాతం వ్యవసాయ అనుబంధ పనులకు కేటాయించాలన్నారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ రాజు, ఫీల్డ్ అసిస్టెంట్ బుర్రవేణి పద్మ, మేట్లు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

విద్యార్థినికి అభినందన



నందినిని అభినందిస్తున్న ఇంటర్మీడియెట్ విద్యాధికారి శ్రీనివాస్

తంగళ్లపల్లి: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీలో 1,000 మార్కులకు 995 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన విద్యార్థిని బి.నందినిని మంగళవారం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వై.శ్రీనివాస్ అభినందించారు. నందిని తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో విద్యనభ్యసించింది. గురుకులాల కోఆర్డినేటర్ థెరిసా, ప్రిన్సిపాల్ పద్మ దర్శనాల, వైస్ ప్రిన్సిపాల్ రమ్యకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీకాం సీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని శ్రీజకు శాతావాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన ప్రథమ సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షలలో 9.2 సాధించింది. ఈ సందర్భంగా శ్రీజను ప్రిన్సిపాల్ శంకర్ అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శోభరాణి, శారద, శ్రీధర్‌రావు, నర్సయ్య, మహేందర్, మధుబాబు తదితరులు ఉన్నారు.



శ్రీజను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

వాట్సాప్ వేదికగా సైబర్ కేటుగాళ్ల గాలం?



గ్రూప్ అడ్మిన్‌లుగా +234 నైజీరియన్ నంబర్లు

తంగళ్లపల్లి: నైజీరియాకు చెందిన ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే ముఠా ×ఇండియా మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌ే పేరుతో వాట్సాప్ గ్రూపులలో లింకులు షేర్ చేస్తూ మోసాలకు తెరలేపింది. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గ్రామానికి చెందిన గ్రామ వాట్సాప్ గ్రూపులో మహ్మద్ సర్వరాజుద్దీన్ అనే వ్యక్తి 7708024895 నంబర్‌తో ఇండియా మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ వాట్సాప్ గ్రూపులో చేరాలని, ఇందులో ఆన్‌లైన్ ద్వారా పెట్టుబడి పెడితే కేవలం 30 నుంచి 45 నిమిషాల్లో పెట్టుబడికి ఆరు రెట్లు లాభాలు వస్తాయని, బిట్ కాయిన్‌లలో పెట్టుబడి పెట్టి లాభాలు ఇస్తామంటూ ప్రచారం చేశాడు. తీరా వాట్సాప్ గ్రూప్ లింక్ ఓపెన్ చేయగా అందులో +234 నైజీరియాకు చెందినవారు అడ్మిన్లుగా, +60 మలేసియాకు చెందిన వారు ఉండడం దర్శనమిచ్చింది. సైబర్ నేరగాళ్లు ఇండియాకు చెందిన కొందరు దుండగులతో చేతులు కలిపి వాట్సాప్ గ్రూపుల్లో లింకులు పోస్టుచేస్తూ అమాయక ప్రజలను దోచుకుంటున్నారు. వాట్సాప్ గ్రూపులలో షేర్ అవుతున్న సైబర్ నేరగాళ్ల లింకుల విషయంపై తంగళ్లపల్లి ఎస్సై రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సైబర్ నేరగాళ్లు అని అనుమానం వస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

నేడు ఎల్లారెడ్డిపేట బంద్

ఎల్లారెడ్డిపేట: పహల్గాంలో హిందూవులపై ఉగ్ర దాడిని నిరసిస్తూ బుధవారం ఎల్లారెడ్డిపేట మండల హిందూ ఉత్సవ సమితి బంద్‌కు పిలుపునిచ్చింది. మండలంలోని వాణిజ్య వర్తక, హోటళ్ల యజమానులు, ఆటోవాలాలు స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని కోరారు. సాయంత్రం ప్రధాన కూడళ్లలో కొవ్వొత్తులతో శాంతిర్యాలీలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బంద్‌కు అన్నివర్గాల వారు సహకరించాలని కోరారు.

భద్రతా సిబ్బందిపై దురుసు ప్రవర్తన

వేములవాడ: వేములవాడ రాజన్న ఆలయ అనుబంధ ఆలయమైన బద్దిపోచమ్మ వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బందిపై వరంగల్‌కు చెందిన ఓ భక్తుడు మంగళవారం దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిసింది. బద్దిపోచమ్మ ఆలయంలోని ఎగ్జిట్ వే నుంచి ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించిన భక్తుడిని నిలువరించేందుకు యత్నించగా భద్రతా సిబ్బందిపై తిరగబడినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కొవ్వొత్తులతో నివాళి

వేములవాడ: పహల్గాంలో ఉగ్రదాడిని వేములవాడ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సంఘం(టీయుడబ్ల్యూజేహెచ్ – 143) తీవ్రంగా ఖండించింది. పట్టణంలోని తెలంగాణచౌక్‌లో మంగళవారం జర్నలిస్టులు కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు రఫీక్‌తోపాటు అజీం, జితేందర్‌రావు, రమేశ్, వెంకటేశ్, ప్రవీణ్, షబ్బీర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంటలో..



ఇల్లంతకుంట: జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిని నిరసిస్తూ మంగళవారం ఇల్లంతకుంట మండల కేంద్రంలోని గంగాధర క్షేత్రం ఆలయం వద్ద భక్తులు దీపాలు వెలిగించి నిరసన తెలిపారు. ఉగ్రదాడి హేయమైన చర్య అన్నారు. మూగు నాగరాజు శర్మ, ఆనంద్ శర్మ, నరసింహచారి, పరుశరాములు, మహిళలు, పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

ముస్తాబాద్: ఆయిల్ పపామ్ సాగుతో రైతులు అధిక లాభాలు సాధించవచ్చని ఆయిల్‌పామ్ సాగు మేనేజర్ ప్రేమ్‌సాయిరెడ్డి అన్నారు. మండలంలోని బందనకల్‌లో ఆయిల్‌సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రైతులు సంప్రదాయ వరిసాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ చేపట్టాలని సూచించారు. మార్కెటింగ్ సౌకర్యాన్ని హార్టికల్చర్ అధికారులు చేపడుతారని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో హార్టికల్చర్ అధికారి గోవర్ధన్, ఏఈవో రేవతి, క్లస్టర్ ఆఫీసర్ హరీశ్, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

వీర్నపల్లి: మండలకేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయ్ అధికారులు స్వప్న మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సరఫరా అవుతున్న గోనె సంచులు చినిగినవి వస్తున్నాయని తమ దృష్టికి వచ్చిందని, ఇబ్బంది లేకుండా గోనెసంచులను సరఫరా చేస్తామన్నారు. సీసీ రాధ, సివిల్ సప్లయ్ సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వేములవాడరూరల్: వేసవి సెలవులు రావడంతో పిల్లల పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రూరల్ మండలంలోని హన్మాజిపేట గ్రామంలో మీ కోసం పోలీస్ కార్యక్రమాన్ని ఎస్సై మారుతి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వేసవిలో దొంగతనాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని ఆయన సూచించారు. సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి సమాచారం ఇవ్వవద్దన్నారు. వాహనదారులు సరైన ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి, భద్రత ప్రమాణాలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రూరల్ సీఐ శ్రీనివాస్

స్వర్ణకారులకు అండగా ఉంటాం

ముస్తాబాద్: స్వర్ణకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. ముస్తాబాద్‌లో దీక్షలు చేస్తున్న స్వర్ణకారులకు మంగళవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి దృష్టికి స్వర్ణకారుల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం అయ్యే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. స్వర్ణకారులు ఆందోళన చెందవద్దన్నారు. కుల వృత్తులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. ఇక్కడ సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, స్వర్ణకారుల మండల అధ్యక్షుడు చింతోజు బాలయ్య, బ్రహ్మం, శ్రీనివాస్, విశ్వనాథం, అనిల్, షాదుల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చక్రధర్‌రెడ్డి

ముగిసిన రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూలు

తంగళ్లపల్లి: రాజీవ్ యువవికాసం దరఖాస్తుల పరిశీలన, ఇంటర్వ్యూలు మంగళవారం తంగళ్లపల్లిలో ముగిశాయని ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ తెలిపారు. మండలవ్యాప్తంగా 30 గ్రామాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సుమారు 3,500 దరఖాస్తులు రాగా 3వేల మంది వరకు దరఖాస్తుదారులు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మీర్జా అఫ్జల్ బేగ్, సూపరింటెండెంట్ దొంతుల రమేశ్, సీనియర్ అసిస్టెంట్ రాధాకృష్ణ, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలో ×రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఎంపీడీవో అబ్దుల్ వాజిద్ మంగళవారం పరిశీలించారు. బీసీ కార్పొరేషన్ కింద మండలంలో 436 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఇంటర్వ్యూలకు 380 హాజరైనట్లు తెలిపారు. మండలంలో 1247 మంది దరఖాస్తు చేసుకోగా 1010 మంది దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

సువార్త మహాసభలు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా హైదరాబాద్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సువార్త మహాసభలు జరుగుతున్నాయి. పాస్టర్ బి.జర్నియ క్రీస్తు సందేశాలు అందించారు. పెద్ద ఎత్తున విశ్వాసులు పాల్గొన్నారు.



ఇంటర్వ్యూల్లో వాగ్వాదం

ముస్తాబాద్: ముస్తాబాద్ మేజర్ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న రాజీవ్ యువవికాసం ఇంటర్వ్యూల్లో మంగళవారం ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించగా, ఇతర కులాలకు చెందిన కొంతమందికి అధికారులు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అందజేశారని అంబేడ్కర్ సంఘం నాయకులు దుబ్బాక రాజు, నల్ల బాబు అభ్యంతరం తెలిపారు. ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు అక్రమంగా పొంది, నిజమైన ఎస్సీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ చేపట్టి తమకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో సర్టిఫికెట్లు పొందారని, తాము ఎస్సీ జాబితాకు చెందిన వారమని పేర్కొన్నారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు వారికి నచ్చజెప్పారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో ఇరువర్గాల వారు శాంతించారు.

గోశాలకు పశుగ్రాసం అందజేత

కోనరావుపేట: మండలకేంద్రానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ కరెడ్ల రమేశ్‌రెడ్డి వేములవాడలోని శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థాన గోశాలకు పశుగ్రాసం అందించారు. రమేశ్‌రెడ్డి 66 కట్టల పశుగ్రాసం అందివ్వగా నిర్వాహకులు రసీదు ఇచ్చారు. కాగా కనగర్తి గ్రామానికి చెందిన పుట్ట భూమయ్య 50 కట్టల పశుగ్రాసం అందించారు.



పశుగ్రాసం అందిస్తున్న రమేశ్‌రెడ్డి